ఘనంగా అమిత్‌షా జన్మదిన వేడుకలు


వస్త్ర, అన్నదానం చేస్తున్న కేంద్ర మంత్రి గిరిరాజ్

తిరుపతి కల్చరల్: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పీసీ. రాయులు ఆధ్వర్యంలో గాంధీ భవన్ ఆవరణలో ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ హాజరై కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధాన మోదీ భారతదేశాన్ని ప్రగతి పథంలో అన్ని రంగాలలో ముబువదుకు తీసుకెళుతున్నారన్నారు. అమిత్‌షా జన్మదిన వేడుకలను పేద ప్రజల మధ్య కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయులు నిర్వహించడం సంతోషకరమని కొనియాడారు. అమిత్‌షా పుట్టిన రోజు సందర్భంగా పాడి పరిశ్రమలకు సంబంధించి సబ్సిడీతో కూడిన ఒక వినూత్నమైన పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. అనంతరం పేదలకు అన్న, వస్త్రదానం చేశారు. కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధిలో నవశకం

- రహదారులతో కార్పొరేషన్‌కు పెరగనున్న ఆదాయం
- సకాలంలో పన్నులు చెల్లించాలి
- స్వచ్ఛ తిరుపతికి ప్రజలు సహకరించాలి
- కమిషనర్ హరిత





తిరుపతి తుడా: తిరుపతి అభివృద్ధిలో నవశకం మొదలైంది. ఆధ్యాత్మిక నగరం లోఎప్పుడు కనిపించని అభివృద్ధి గత నాలుగేళ్లలో చూస్తున్నాం.. ఇప్పటికే అభివృద్ధికి సంబంధించి అనేక ప్రణాళికలు సిద్ధమయ్యాయి. డిసెంబర్ నాటికి దాదాపుగా ప్రతిపాదిత పనులన్నీ పూర్తి చేస్తాం.. ఆపై మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళుతున్నాం.. తిరుపతి స్మార్ట్ సిటీ, అమృత్ పథకాలతో పాటు కార్పొరేషన్ జనరల్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వందలాది కోట్ల తో నగరం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది... అని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

ఆదాయ వనరుగా రహదారులు

తిరుపతి నగర విస్తరణ, నగరానికి కనెక్టివిటీ పెంచడం, నగరంపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 10 మాస్టర్ ప్లాన్ రోడ్లు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ రోడ్లతో తిరుపతి మరో 5 ఎకరాల్లో విస్తరిస్తుంది. వేలాది నిర్మాణాలకు అడుగులు పడ్డాయి. తద్వారా కార్పొరేషన్‌కు భవన నిర్మాణ అనుమతులు, యూడీఎస్, వాటర్ కనెక్షన్లు, ఇంటి పన్నులు రూపంలో కార్పొరేషన్ కు కోట్లాది రూపాయలు సమకూరనుంది. రహదారులు అభివృద్ధి చెందిన ప్రాంతం కార్పొరేషన్ ఆదాయ వనరుగా మారనుంది. రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేసిన మొత్తం రెండు మూడేళ్లలోనే కార్పొరేషన్ తిరిగి చేరుతుంది. ఆపై ప్రతి ఏటా కార్పొరేషన్‌కు ఐదారు కోట్ల మేర ఆదాయం వస్తుంది.

సకాలంలో పనులు చెల్లించాలి

నగరం మరింత అభివృద్ధి చెందాలంటే అందుకు తగిన వనరులు సమకూర్చుకోవడం అవసరం. నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా వాటిని నగర అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు ఖర్చు చేస్తాం. నిర్దేశించిన గడువులోపు ప్రజలంతా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి దోహదపడాలి.

స్వచ్ఛతిరుపతికి ప్రతి ఒక్కరు కట్టుబడాలి

స్వచ్ఛ తిరుపతి కోసం రాజీలేని నిర్ణయాలు అమలు చేస్తున్నాం. ఏటా ఇందుకోసం కోట్లు ఖర్చు చేస్తున్నాం చెత్తను 100 శాతం రెడ్యూజ్, రీ యూజ్, రీసైకిల్ నిర్వహిస్తున్నాం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలతో ముందుకెళుతున్నాం. అయితే నగర ప్రజల నుంచి స్వచ్ఛ తిరుపతి కోసం మరింత సహకారం కావాలి. చెత్తను ప్రతిరోజు మీ ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకే అందించాలి. ఖాళీ స్థలాలు కాలువలో పారబోయడం మానుకోవాలి. చేయి చేయి కలిపితేనే స్వచ్ఛ తిరుపతి సాధ్యం అవుతుంది. పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే ప్రధాన లక్ష్యం. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తాం.

అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు

తిరుపతి అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలురచించాం. నగర ప్రజల మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈట్ స్మార్ట్ స్ట్రీట్లు అభివృద్ధి చేసి ఒకే చోట పరిశుభ్రమైన వంటకాలను అందించేందుకు చర్యలు చేపట్టాం. నగరంలో ఎక్కడా ఆధునిక రహదారిలేని ప్రాంతం ఉండకూడదన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం. 24 గంటలు నీటి సౌకర్యాన్ని తీసుకువస్తాం. సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం తిరుపతికి ఐకానిక్ గా నిలుస్తుంది. రైల్వే స్టేషన్ పార్సెల్ సెంటర్‌కు ఎదురుగా నిర్మిస్తున్న మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ తిరుపతిని మరో స్థాయికి తీసుకెళుతుంది. నగర ప్రజలకు ఆధునిక మౌలిక వసతుల కల్పనతో పాటు నగర అభివృద్ధికి అవసరమైన అనేక ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. దశలవారీగా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తాం. తిరుపతిలో మొదలైన అభివృద్ధి శకాన్ని రాబోయే రోజుల్లో మరింతగా కొనసాగిస్తాం.

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అహ్మద్ ఖాద్రికి అభినందనలు


షఫీ అహ్మద్ ఖాద్రిని అభినందిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, మైనారిటీ నేతలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన తిరుపతికి చెందిన సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రిని ఆదివారం డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆయన్ను అభినందించారు. అభినందించిన వారిలో కార్పొరేటర్ వెంకటేష్, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఇమ్రాన్, తిరుపతి మసీదు ముతవల్లీలు షేక్ చాంద్‌భాషా, షేక్ బాబు, ఏటీకే మాలిక్, సాధి మహల్ చైర్మన్ ఎస్.గఫూర్, ముస్లింలు, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు ఉన్నారు.

నేడు శ్రీరామకోటి విజయోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీరామకోటి విజయోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు ఇక్కడి ఆలయంలో, ఇళ్ల వద్ద, సంవత్సర కాలంలో రాసిన శ్రీరామకోటి పుస్తకాలను శ్రీరామకోటి స్థూపంలో నిక్షిప్తం చేయడాన్ని శ్రీరామకోటి విజయోత్సవంగా ప్రతి ఏటా విజయ దశమి నాడు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శ్రీరామనామ కోటి పుస్తకాలను శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో నుంచి నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి దొడ్డాపురం వీధి, గాంధీ రోడ్డు, ప్రకాశం రోడ్డు, మహతి కళాక్షేత్రం మీదుగా శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకుంటారు. అక్కడున్న శ్రీరామకోటి స్థూపంలో పుస్తకాలను నిక్షిప్తం చేస్తారు.

బాలసుబ్రమణ్యంకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న ఎన్ బాలసుబ్రమణ్యం

తిరుపతి సిటీ: బెంగళూరు విశ్వవిద్యాలయం 58వ స్నాతకోత్సవంలో ఎస్వీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న ఎన్.బాలసుబ్రమణ్యంకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న భరతనాట్యం


నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): దసరా మహోత్సవం పురస్కరించుకుని తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన భరతనాట్యం అలరించింది. తిరుపతికి చెందిన నటరాజ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ గురువులు భార్గవి, రాజశ్రీ, షబ్బీర్‌ల ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్య కార్యక్రమం ఆకట్టుకుంది. వివిధ పాటలకు కళాకారులు హర్షిణి, శ్రీలాస్య, రేషిక, సుమేద, ప్రణవి, జశ్వంత్, మోక్షిత్, దీప్తి, ఇద్వ్యి, రిత్విక, వర్షిక, యాశ్వితల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదాల ద్వారా విలువలతో కూడిన జీవనం

తిరుమల: వేదం ప్రామాణికంగా నడుచుకుంటే నైతిక విలువలతో కూడిన జీవనం అలవడుతుందని జీవా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డైరెక్టర్ ఆచార్య సముద్రాల రంగ రామానుజాచార్యులు తెలిపారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల నాదనీరాజనం వేదికపై జరుగుతున్న శ్రీనివాస వేద విద్వత్ సదస్సులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆయన 'వేదాల్లోని పురుషార్థాలు' అనే అంశంపై ఉపన్యసించారు. వేదం ధర్మ, అర్థ, కామ, మోక్షాలను గురించి తెలుపుతుందన్నారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ


దోర్నకంబాలలో వధువుకు పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన వివాహ కానుకను పార్టీ నాయకులు ఆదివారం వధువు కుటుంబ సభ్యులకు అందజేశారు. గురువారం మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీకి చెందిన నందిని, వినయ్‌లకు వివాహం నిశ్చమైంది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు నాయకులతో కలసి నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికం, మహార్తపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు-కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌతమి, ఉప సర్పంచ్ మురళిరెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు.. ఆర్టీసీ-డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: తిరుపతి మంగళం డిపో మేనేజర్ కేసీజీ భాస్కర్ సోమవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం చేపడుతున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంగళం ఆర్టీసీ డిపోకు సంబంధించి సమస్యలు ఉంటే ఎవరైనా 78937 23453 నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చునని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చాముండేశ్వరి దేవికి పట్టువస్త్రాలు



ఆధ్యాత్మిక శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు





ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, భక్తులతో కలిసి సారెను తీసుకువస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న ఆలయం నుంచి పట్టు వస్త్రాలు
- ఆధ్యాత్మిక శోభాయాత్రగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రధానమైన దుర్గాష్టమి పర్వదినాన తుమ్మలగుంట శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలు (సారె)ను తీసుకుని అమ్మవారి ఆలయం వద్దకు ఆధ్యాత్మిక శోభాయాత్రగా తీసుకొచ్చారు

మోహిత్ రెడ్డి సారె సమర్పణ

మహిమాన్వితమైన శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తీసుకొచ్చిన సారెను సమర్పించారు. తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తల్లి చెవిరెడ్డి లక్ష్మి, సోదరుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి దగ్గరుండి అమ్మవారికి సారెను అందజేశారు. తుమ్మలగుంట నుంచి తీసుకువచ్చిన సారెకు అమ్మవారి ఆలయం వద్ద మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సారె తెచ్చిన తుడా చైర్మన్ మోహిత్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. అమ్మవారికి సారె సమర్పణలో చెవిరెడ్డి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి పాల్గొంటారని జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు వారు నెలవాయి, అంబమహారాజపురం, పుల్లూరు, శెట్టివానత్తం, వి.వి.పురం, తయ్యూరు సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ నూతన భవనం పరిశీలన



నూతన పీహెచ్‌సీ భవవాన్ని పరిశీలిస్తున్న హర్షిత్‌రెడ్డి

పాకాల: నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం స్థానిక నాయకులతో కలసి పీహెచ్‌సీ భవనాన్ని సందర్శించారు. నవంబర్ 1వ తేదీన ఆస్పత్రి భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.1.79 కోట్ల నిధులతో నిర్మించిన ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో రెండు వైద్యాధికారుల గదులు, రెండు స్టాఫ్ నర్సుల గదులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, మందుల గది, పురుషులు, స్త్రీలకు వేరువేరుగా వార్డులు, ఆపరేషన్ థియేటర్ గది, ల్యాబ్ రూం, మీటింగ్ హాలు, వేర్వేరుగా పురుషులకు, స్త్రీలకు వ్యక్తిగత మరుగుదొడ్లతో అత్యాధునికంగా ఈ భవనాన్ని నిర్మించారని తెలిపారు. అలాగే ఏసీలు–3, ఇన్వర్టర్లు–2, టీబీ, కరోనా వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ట్రూనాట్ మిషన్, స్కానింగ్ మిషన్‌ను కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ ప్రారంభోత్సవానికి అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్ఆర్ సీపీ పాకాల ఇన్‌చార్జి పులికేశవమూర్తిరెడ్డి, నాయకులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఆత్మీయ సమావేశం

పాకాల: భారతంమిట్టలో పంచాయతీ వైస్ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి నివాసంలో విజయదశమి సందర్భంగా ఆదివారం వార్డు మెంబర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఇంకా జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వివరించారు. అనంతరం ప్రతీ వార్డు మెంబర్‌కు దుస్తులు, పండ్లు, స్వీట్స్ అందజేసి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ ఎస్.కస్తూరి, ఎంపీటీసీలు స్వర్ణ, పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నంగా కపిలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు హర్షిత్‌రెడ్డి పూజలు

చంద్రగిరి: మండపం పల్లి గ్రామంలో నూతనంగా ప్రాణ ప్రతిష్ట చేసిన నడి వీధి గంగమ్మ పూజలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆదివారం నడివీధి గంగమ్మ వద్దకు చేరుకున్న ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్న హర్షిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.





వార్డు మెంబర్లకు విజయదశమి కానుకను అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

తరతరాల పుణ్యమే... భక్త జన సేవ



అలిపిరి వద్ద టీటీడీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుపతి కల్చరల్: దేవుడైన తిరుమల గోవిందుని భక్తులకు సేవ చేయడం అంటే తరతరాల పుణ్యమేనని టీటీడీ బోర్డు సభ్యుడు ఎన్.నాగరత్నం తెలిపారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కె.ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం గరుడ సర్కిల్ వద్ద భక్తులకు భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. నాగరత్నంతో పాటు మరో ఇద్దరు టీటీడీ బోర్డు సభ్యులు జీవీ సుబ్బరాజు, సి.అశ్వర్థ నాయక్ పాల్గొని, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు కె.ఆంజనేయులు మాట్లాడుతూ పదిహేనేళ్లుగా ప్రతి ఏడాది తమ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ఇచ్చిన సలహాలు తమకు ఆదర్శమని తెలిపారు. జేఏసీ కోశాధికారి వెంకటరత్నం, సభ్యులు సుబ్రమణ్యం రెడ్డి, బాలసుబ్రమణ్యం, క్రాంతి, ఎలక్ట్రికల్ విభాగం చెన్నూరు సుబ్రమణ్యం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి... అలనాటి జ్ఞాపకాలు



విద్యాబుద్ధులు నేర్పించిన గురువులతో జేఆర్‌కేఆర్ పూర్వ విద్యార్థులు



ఏ.రంగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

చంద్రగిరి: చదువులు ముగించుకుని వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డ ఏ.రంగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 31 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. జెడ్పీ పాఠశాల వేదికగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1991–92కు చెందిన 10వ తరగతి చదవుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో చేసిన అల్లరి, ఐకమత్యాన్ని గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. తాము చేసిన తప్పులను బెత్తంతో సరిచేస్తూ, మార్గనిర్దేశం చేసిన గురువుల పాదాలకు పాలాభిషేకం చేసి సత్కరించారు.

చంద్రగిరిలో...

బ్రాహ్మణ వీధిలోని పట్నం అయ్యావారు(జేఆర్‌కేఆర్)పాఠశాలలో 1988–1995 వరకు 1 నుంచి 7వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఓ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. 40 మందికి పైగా బాల్యమిత్రులు సమావేశంలో కలుసుకున్నారు. తాము ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డానికి కారణమైనా ఆనాటి గురువులు శోభ, రత్న, సుగుణ, అనసూయ, మేరి, కష్ణమూర్తి, రఘునాథరెడ్డి, అనంద రెడ్డి, సీతారాం రెడ్డి, సరళ, సాగర్‌లను ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. పూర్వ విద్యార్థులు సాయిమాధవ కృష్ణ, గోపి, మునిరాజ, హరి, హరీష్, లోకేష్, హంస, పావని, శైలజ, గౌరి, శశి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయం బహురూప కళా విన్యాసం



మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య సంకీర్తనను సకల కళా సమాహారంతో ప్రదర్శిస్తున్న పీఎస్‌వీ.మురళీకృష్ణ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి మృదంగ విద్వాంసుడు పీఎస్‌వీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వినూత్న బహురూప కళా విన్యాసం అద్వితీయంగా సాగింది. నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తనను ఒకే వేదికపై విభిన్న రాగాలలో 13 కళారూపాల ద్వారా 65 మంది కళాకారులతో గాత్ర, హిందూస్థానీ, లలిత, కర్ణాటక సంగీతం, పాశ్చాత్య సంగీతం, వాయిద్య సమ్మేళనం, హరికథ, నాట్యం, బుర్రకథ, నాటకం, చిత్రలేఖనం వంటి సకల కళా సమాహారంగా ప్రదర్శించి మైమరిపించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో సంగీత విద్వాంసురాలు డాక్టర్ వీజే ద్వారం లక్ష్మీ ప్రదర్శించిన భక్తి సంగీత కచేరి భక్తులను ఆకట్టుకుంది. శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజేష్‌కుమార్, కె.సుబ్రమణ్యం ప్రదర్శించిన గానామృతం సభికులను అలరింపజేసింది.

క్లుప్తంగా

తిరుమలలో గ్యాస్ సిలిండర్ల కొరత



గ్యాస్ లారీ వద్దకు వచ్చి సిలిండర్లను తీసుకుని వెళుతున్న స్థానికులు

తిరుమల: గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కోసం తిరుమలవాసులు బండెడు కష్టాలు పడుతున్నారు. బుక్ చేసి రెండు నెలల క్రితం ఆన్‌లైన్‌లో నగదు చెల్లించినా సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందక ఇబ్బంది పడుతున్నారు. అద్దె చెల్లించలేదని గత నెల 20న తిరుమలలోని హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ కంపెనీల గోదాములను మూసివేశారు. అప్పటి నుంచి తిరుమలవాసులకు గ్యాస్ బండ అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలో నోస్టాక్, నోగోడాన్ కింద వాహనాల్లో తీసుకువచ్చి సరఫరా చేయవచ్చునని టీటీడీ రెవెన్యూ అధికారులు ప్రకటించారు. అయితే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం తమకు ఎటువంటి అనుమతులు రాలేదని చేతులెత్తేశారు. దీంతో పరిస్థితి దిగజారడంతో అత్యవసరంగా ఆదివారం ఉదయం ప్రత్యేకంగా కొన్ని గ్యాస్ లారీలకు అనుమతినిచ్చారు. గ్యాస్ సిలిండర్లు వచ్చాయని తెలియడంతో స్థానికులు పెద్దఎత్తున గ్యాస్ లారీల వద్దకు చేరుకున్నారు. దీంతో బారెడు క్యూ ఏర్పడింది. గంటల తరబడి క్యూలైన్లో ఉండి గ్యాస్ సిలిండర్లను తీసుకుని వెళ్లారు. తిరుమలలో గ్యాస్ సిలిండర్ల సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే మల్లాది విష్ణు



జడ్జి స్మితాగోపాల్

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరున్ని ఆదివారం విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అలాగే అహ్మదాబాద్ హైకోర్టు జడ్జి స్మితాగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి వేదపండితులతో ఆశీర్వాదం ఇప్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ సారధి, పీఆర్‌ఓ నాగభూషణం నాయక్, టెంపుల్ ఏఈఓ ధనపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రివేళ నిఘా పెంచండి

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని శ్రీరంగరాజపురం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉన్నందున రాత్రివేళలో నిఘా పెంచాలని డీఎస్పీ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో అక్రమ రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, సిబ్బందితో నిఘా పెంచాలని సూచించారు. అలాగే నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తోలే ట్రాక్టర్లు, లారీలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండేలా చూడాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ నిర్వహించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యబాబు, ఎస్‌ఐలు షెక్షావలి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 52 మంది ఎంపిక

పుత్తూరు రూరల్: వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 175 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 52 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మరో 60 మందికి కళ్లద్దాలతో పాటు మందులు పంపిణీ చేశారన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని అరవింద ఆస్పత్రి వారే వారి వాహనంలో తీసుకెళ్లి ఆపరేషన్ల అనంతరం స్వస్థలానికి చేరుస్తారని తెలిపారు.

ఏఐటీయూసీ నేతల ఫిర్యాదు

కార్వేటినగరం: మండల పరిధిలోని అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ కార్మిక జెండాను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు అన్నారు. ఆదివారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ దస్తగిరికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్వేటినగరం మండలంలో ఏఐటీయూసీ జెండాను 5 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేశామని, ఏటా మే 1న మేడే ఉత్సవాన్ని కార్మిక సంఘాల నాయకులతో కలిసి జరుపుకుంటామని తెలిపారు. అయితే ఏఐటీయూసీ జెండాను శుక్రవారం రాత్రి తొలగించారని ఆరోపించారు.

గోవిందోత్సవం



తిరు మాడవీధుల్లో రథంపై విహరిస్తున్న మలయప్ప స్వామివారు



అశ్వ వాహన సేవ ముందు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు, ఈవో ధర్మారెడ్డి తదితరులు



అశ్వ వాహన సేవ ముందు దశావతార కళారూపాల ప్రదర్శన



వాహన సేవలో వాయిద్యాల హోరు



శ్రీవారి దర్శనానంతరం రాష్ట్ర గవర్నర్ దంపతులు



స్వామివారి రథం లాగుతున్న మహిళామణులు



మాడ వీధుల్లో నెమలి విన్యాసం



శ్రీకృష్ణుని లీలామృత ప్రదర్శన



రథం ముందు వాయిద్య కారుల విన్యాసం

ఆధ్యాత్మిక ఝరి

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలతో తుమ్మలగుంటలో భక్తిభావం వెల్లివిరుస్తోంది. గ్రామం యావత్తు శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి సేవలో తరిస్తోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా వాహన సేవల్లో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తుమ్మలగుంటవాసులు ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెంట నడుస్తూ సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న అశేష భక్త జనావళికి విశేష సేవలు అందిస్తున్నారు.





వాహన సేవలో చిన్నారి ఉత్సాహం



అశ్వవాహన రూఢుడైన శ్రీకల్యాణ వెంకన్నకు మొక్కుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు



శ్రీకల్యాణ వెంకన్న రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు





తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి సారె సమర్పణ



రథాన్ని లాగుతున్న వేద పాఠశాల విద్యార్థులు



అశ్వ వాహన సేవలో అశేష భక్త జనం



వాహన సేవ వద్ద ప్రసాదాల పంపిణీ

మహిషాసుర మర్దినిగా జ్ఞానప్రసూనాంబ



శ్రీకాళహస్తి: మహిషాసుర మర్దినిగా భక్తులను అనుగ్రహిస్తున్న జ్ఞానప్రసూనాంబ అమ్మవారు

శ్రీకాళహస్తి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తి మహిషాసుర మర్దిని అలంకరణలో అనుగ్రహించారు. ఆయుధాలకు పూజలు చేసిన అనంతరం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి, అనంతరం మహిషాసుర మర్దినిగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి రంగుల గోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో బొమ్మలకొలువులో అమ్మవారి ఉత్సవమూర్తి సిద్ధదాత్రిగా దర్శనమిచ్చారు. కనక దుర్గమ్మ మహాదుర్గమ్మగా కటాక్షించారు. కనకాచలం మీద వెలసిన దుర్గమ్మ మహిషాసుర మర్దిని అలంకరణలో కటాక్షించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు కొలువుదీరారు. ఏడుగంగల మహాగౌరి అమ్మవారిని దర్శించుకున్నారు. పానగల్ పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం పెద్ద గంగమ్మ, చిన్నగంగమ్మ దుర్గాదేవి ఆలయంలో కనక దుర్గమ్మ, బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో ఉత్సవమూర్తి మహాదుర్గగా, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, త్రిశూలాంబ ఆలయం తరపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లిలో వెలసిన అమ్మవారి ఆలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాపానాయుడుపేట భద్రకాళి, అంజిమేడు గంగమ్మ, గుడిమల్లం ఆనందవల్లీ దేవి, మూలకండ్రిగ ఓసూరమ్మ ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.